సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



మత్తు.. యువత చిత్తు

మద్యం మత్తులో యువత చిత్తవుతోంది. తమ జీవితాలను నాశనం చేసుకుంటూ ఇతరులకూ హాని కలిగిస్తున్నారు. 8లో▸



బోనాలు సంస్కృతికి ప్రతీక

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



అభివృద్ధికి 176.46 కోట్లు

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

13 నిమిషాలు.. అన్ని దేశాల పేర్లు

ఆమనగల్లు విద్యార్థిని ప్రపంచ రికార్డు



శ్రీ వైష్ణవిని అభినందిస్తున్న కలెక్టర్ శశాంక

ఆమనగల్లు: ప్రపంచంలోని అన్ని దేశాల పేర్లను కేవలం 13 నిమిషాల్లో రాసిన అతి పిన్న వయస్కురాలిగా ఆమనగల్లుకు చెందిన వివేక విద్యాభారతి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న గంజి శ్రీ వైష్ణవి రికార్డు సృష్టించింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో ఆమె ప్రతిభను గుర్తించిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్సీ సర్టిఫికెట్‌తో పాటు మెడల్ అందించారు. ఇది ప్రపంచ రికార్డు అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు శనివారం తమ కార్యాలయాల్లో వైష్ణవిని అభినందించారు. కార్యక్రమంలో వివేక విద్యాభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ట్రస్మా వర్కింగ్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, పీఈడీ భాస్కర్‌రెడ్డి, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాస్ తదితరులు ఉన్నారు.

అభిప్రాయ సేకరణ అంతంతే..



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తదితరులు

సాక్షి,రంగారెడ్డి జిల్లా: ఆర్‌ఓఆర్ 2024 చట్టం బిల్లుపై చేపట్టిన అవగాహన కార్యక్రమాన్ని మొక్కుబడిగా ముగించారు. ఆర్‌ఓఆర్ చట్టం రూపకల్పనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు రైతులు, ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, నిపుణులు, అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించింది. ప్రజలు, భూబాధితులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదు. కేవలం ఒకరిద్దరు న్యాయవాదులు, నాయకులను పిలిచి అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని మమ అనిపించారు. ఈ మేరకు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ప్రస్తుత 2020 రెవెన్యూ (ఆర్‌ఓఆర్) చట్టంతో కలిగే ఇబ్బందులను తొలగించి రైతులకు ఉపయోగకరమైన చట్టాన్ని తీసుకొచ్చేందుకు ఆర్‌ఓఆర్ 2024 చట్టం బిల్లుపై అవగాహన, అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ధరణి చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బార్ అసోసియేషన్ మెంబర్ కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

'పట్నం' డిపోకు ప్రగతిచక్ర పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డిపో మేనేజర్ వెంకటనర్సప్ప

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందింది. రాష్ట్రస్థాయిలో ఇచ్చే ప్రగతిచక్ర పురస్కారాల్లో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. డిపో ఖర్చులు తగ్గిస్తూ.. ఆదాయాన్ని పెంచుతూ.. ఉద్యోగులకు విధి నిర్వహణపై అవగాహన పెంపొందిస్తూ.. ఆర్టీసీని అన్నివిధాలా ప్రగతి పథంలో ముందుకు నడిపించే డిపోకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు. నగరంలోని ఆర్టీసీ కళాభవన్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో రోడ్లు, రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప పురస్కారం అందుకున్నారు. రూ.2.50 లక్షల నగదు చెక్, షీల్డ్‌ను బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌జెడ్‌ఈడీ వీర్లపల్లి వెంకటేశ్వర్లు, ఆర్ఎం బి.వరప్రసాద్, డిప్యూటీ ఆర్ఎంలు సుచరిత, జగన్ పాల్గొన్నారు.

అందరి కృషి ఫలితమే..

ఈ సందర్భంగా వెంకటనర్సప్ప మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు, డిపో ఉద్యోగుల కృషి ఫలితంగానే పురస్కారం దక్కిందని అన్నారు. గత సంవత్సరం రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలవగా.. ఈసారి ద్వితీయ స్థానం దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రయాణికులకు మరింత చేరువయ్యేలా, డిపో అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు.



షాద్‌నగర్‌రూరల్: ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణులు

రారా కృష్ణయ్య

జయకృష్ణా ముకుందా మురారి.. అంటూ కృష్ణాష్టమి వేడుకలను ఆయా పాఠశాలల్లో శనివారం ముందస్తుగా జరుపుకొన్నారు. పలువురు చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుడి వేషధారణలో ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుడి గీతాలతో నృత్యాలు చేశారు. ఉట్లు కొడుతూ సరదాగా సందడి చేశారు.





ఆమనగల్లు: చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



కడ్తాల్: ఉట్టి కొడుతున్న చిన్నారి

వారం వారం.. హైడ్రా భయం

- చెరువుల పరిరక్షణలో వ్యూహాత్మక వైఖరి
- శని, ఆదివారాల్లోనే కూల్చివేత కార్యక్రమం
- ఎన్-కన్వెన్షన్ ఉదంతంతో హాట్ టాపిక్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహా నగరంలోని చెరువుల పరిరక్షణకు నడుం కట్టిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఈ వ్యవహారంలో వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. తొలినాళ్లల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాల కూల్చివేతల నేపథ్యంలో తలెత్తిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని తన పంథా మార్చింది. భారీ, సున్నితమైన కూల్చివేతల్ని కేవలం శని, ఆదివారాల్లో మాత్రమే చేపట్టాలని నిర్ణయించింది.

మూడు దశల్లో కార్యాచరణ..

- హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గత నెల 19న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మరునాడే సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్ ఆ విభాగం కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. తక్షణం చెరువుల పని ప్రారంభించిన ఆయన వరుసపెట్టి క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులు, కోర్టు కేసులతో పాటు తమకు వస్తున్న ఫిర్యాదు ఆధారంగా చెరువులు, కుంటలు, నాలాల్లో ఆక్రమణల్ని గుర్తించారు. చెరువుల పరిరక్షణకు మూడు దశల్లో కార్యాచరణ అమలు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నిర్ణయించారు. మొదటి దశలో ఇకపై ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఒక్క చదరపు అడుగు కూడా ఆక్రమణ కాకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- అందులో భాగంగానే నోటిఫై అయిన ఆయా ప్రాంతాల్లోని నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. వనస్థలిపురం, బాచుపల్లి తదితర చోట్ల ఉన్న వాటిని ఇతర వారాల్లో కూల్చేశారు. ఆ అనుభవాల నేపథ్యంలోనే శని–ఆదివారాల్లోనే కూల్చివేతలు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. ఈ కారణంగానే శివరాంపల్లిలోనివి ఈ నెల 10 (శనివారం), ఉస్మాన్‌సాగర్‌కు సంబంధించి గండిపేట, శంకర్‌పల్లిలో ఉన్నవి ఈ నెల 18 (ఆదివారం) కూల్చేశారు. తాజాగా ఎన్–కన్వెన్షన్‌ను సైతం శనివారమే కూల్చేయడం గమనార్హం. ఈ చర్యతో హైడ్రా మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.
- చెరువుల పరిరక్షణలో రెండో దశలోగా ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో ఉన్న అనుమతి ఉన్న, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటారు.

మూడో దశలో ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్న మాదిరిగా చెరువుల పునరుద్ధరణకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ప్రసుత్తం మొదటి దశ నడుస్తోంది. నగరంలో ఉన్నవి అన్నీ గొలుసుకట్టు చెరువులే కావడంతో ఒకటి అలుగు పారితే ఆ నీరు నాలాలు, వాగుల ద్వారా మరో దాంట్లోకి వెళ్లాలి. ఆ పరిస్థితి తీసుకురావడానికి కృషి చేయాలని హైడ్రా నిర్ణయించింది.

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న నిర్మాణాలు, లేఔట్లలో ప్రజలు ఫ్లాట్లు, స్థలాలు ఖరీదు చేయవద్దు. త్వరలో ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టనున్నారు. ఇప్పటికే ఇలా ఖరీదు చేసి నష్టపోయిన వాళ్లు ఉంటే బిల్డర్‌పై కేసు పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపైనా విచారణ చేసి, చర్యలకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం ఎన్–కన్వెన్షన్ కూల్చివేతతో దాదాపు 9 బుకింగ్స్ రద్దయినట్లు తెలిసింది.

ప్రజలతో మమేకం కావాలి



సన్మానం అందుకున్న మహిళా అధికారులు

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ ఉద్యోగికి తన సర్వీసులో బదిలీ అనేది సర్వసాధారణమని, ఎక్కడ పని చేసినా.. ఆయా ప్రాంతప్రజలతో మమేకం కావాలని కలెక్టర్ శశాంక అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి నీరజ గాంధీ, డీసీసీఓ ధాత్రి దేవి, జిల్లా పౌర సంబంధాల అధికారి పద్మశ్రీ, సివిల్ సప్లయ్ డీఎంఓ విజయలక్ష్మి ఇటీవల బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి వారిని సన్మానించారు. ఇతర జిల్లాల నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఓ సునీల్, ఆర్డీఓలు సూరజ్ కుమార్, అనంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, వేణుమాధవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి పీడీ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, ఉద్యానవన శాఖ అధికారి భాగ్యలక్ష్మి, డీసీసీఓ సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి పద్మజా రమణ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ రాథోడ్, ఎన్ఐసీ అధికారి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే మన్నెగూడ రోడ్డుకు మోక్షం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్: త్వరలోనే లంగర్‌హౌస్ టిప్పుఖాన్ బ్రిడ్జి నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం అవుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంట్ ప్రారంభానికి వచ్చిన మంత్రికి స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి అభివృద్ధిపై మంత్రితో మాట్లాడారు. అదేవిధంగా గ్రామాల్లో ఏళ్ల క్రితం వేసిన రోడ్లు గుంతలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి అక్కడి నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. త్వరలోనే ఆయా రోడ్ల పనులు ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ.. హైడ్రా అధికారులు వారి పని వారు చేసుకొని పోతున్నారని.. ఇందులో ఎలాంటి సందేహాలు అక్కరలేదని స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్‌కు చెందిన కీలక నేత ఫామ్‌హౌస్‌ను సైతం కూల్చివేసిన విషయాన్ని గుర్తు చేశారు. 111 జీవో విషయంలో ఇబ్బందులు రాకుండా చూసుకునే బాధ్యత తనదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద దీనిపై హామీ తీసుకున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మంత్రిని కలిసిన వారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమ్‌భరత్, ఎన్కెపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, షాబాద్ దర్శన్ తదితరులు ఉన్నారు.

క్లీన్ ఫైన్!

సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ ర్యాంకుల్లో అవార్డులు వస్తున్నా.. నగరంలో పారిశుద్ధ్యం పరమ అధ్వానంగా ఉంటోంది. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు.. వాటిపై ముసురుతున్న దోమలతో వ్యాధులు.. పరిసరాల్లో దుర్గంధంతో నగర పరిస్థితి పేరు గొప్ప.. ఊరు దిబ్బ చందంగా మారింది. ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరించే కార్మికులు రాకపోవడంతో ప్రజలు రోడ్ల పక్కనే ఇళ్ల చెత్తను పారబోస్తున్నారు. గతంలో డంపర్‌బిన్లు ఉన్నప్పుడు వాటిలో చెత్త వేసేవారు. స్వచ్ఛ ర్యాంకుల కోసం వాటిని తొలగించడంతో ఇప్పుడు రోడ్ల పక్కనే పడేస్తున్నారు. ఈ పరిస్థితి నివారణకు జరిమానాల కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది.

ఏం చేసినా..

ప్రజలు చెత్త వేసే బహిరంగ ప్రదేశాలను గా ర్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీ)గా గు ర్తించి అక్కడ శుభ్రం చేసి ముగ్గులు, రంగవల్లుల వంటి కార్యక్రమాలతో పాటు బర్త్‌డే వే డుకలు వంటివి సైతం నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో జరిమానాల విధింపు ద్వారానే ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వే యకుండా ఉంటారని భావిస్తున్నారు. జరిమానాల గురించి ఇప్పటికే కొన్ని జోన్లలో ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. పోస్టర్లతో పాటు గోడలపై రాతలు రాస్తున్నారు. అంతేకాకుండా ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ ఈ అంశాన్ని ప్రచారం చేస్తున్నారు. ఎవరూ చూడట్లేదు కదా అని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే వెయ్యి రూపాయల జరిమానా విధించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

సీసీ కెమెరాలతో గుర్తింపు

మరోవైపు జీవీపీల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే యోచనలో జీహెచ్‌ఎంసీ అధికారులున్నారు. ఒకటి రెండు ప్రాంతాల్లో ఇప్పటికే ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేశారు. వాటి ద్వారా తరచూ అక్కడ చెత్త వేసే వారిని గుర్తించి, జరిమానాలు విధించే యోచనలో ఉన్నారు.జరిమానాల గురించి ముందస్తుగా విస్తృతంగా ప్రచారం చేసి జరిమానాలు విధించాలనుకుంటున్నారు. అధికారుల ఈ ఆలోచన బాగానే ఉన్నప్పటికీ, అంతకంటే ముందు ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ సవ్యంగా జరగనిదే ప్రజల నుంచి విమర్శలు తప్ప కార్యక్రమం విజయవంతం కాదనే అభిప్రాయాలు జీహెచ్‌ఎంసీ వర్గాల నుంచే వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏం జరగనుందో వేచి చూడాల్సిందే!

బీపీ, షుగర్‌తో ప్రాణాలకే ముప్పు

- ఆల్కాహాల్, పొగాకు పూర్తిగా మానేయాలి
- ఐఎస్‌ఏ అవగాహన సదస్సులో ప్రతినిధుల వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎస్‌ఏ అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్‌సూర్య

అబ్దుల్లాపూర్‌మెట్: బీపీ, షుగర్‌ను నియంత్రించకపోతే ప్రాణాలకే ముప్పు అని.. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్‌ఏ) ప్రతినిధులు పేర్కొన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు వంటి ప్రమాదాలకు కారణాలతో పాటు వీటి నుంచి ఎలా కాపాడుకోవాలి..? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై 'మిషన్ బ్రెయిన్ అటాక్' పేరుతో నగర శివారులోని ఫిల్మ్‌సిటీలో శనివారం అవగాహన సదస్సు ప్రారంభించారు. జాతీయ ప్రచార కార్యక్రమమైన 'మిషన్ బ్రెయిన్ అటాక్' ప్రధానంగా స్ట్రోక్స్‌కు సంబంధించి ఎండ్ టు ఎండ్ సంరక్షణపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐఎస్‌ఏ అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్‌సూర్య మాట్లాడుతూ.. స్ట్రోక్ వచ్చేందుకు బ్లడ్ ప్రెషర్, షుగర్, కొలెస్ట్రాల్ మూడు ప్రధాన కారణాలన్నారు. స్ట్రోక్ బారిన పడిన వారి కుటుంబాల్లో ఎవరికైనా బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆల్కాహాల్, పొగాకు వంటి అలవాట్లను పూర్తిగా మానేయాలని సూచించారు. సగటున ప్రతీ నిమిషానికి ముగ్గురు పెరాలిసిస్, ప్రతీ నలుగురిలో ఒకరు గుండెపోటు బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెరాలిసిస్ మరణానికి మూడో అతిపెద్ద కారణమని తెలిపారు. ఐఎస్‌ఏ కార్యదర్శి డాక్టర్ అరవింద్ శర్మ మాట్లాడుతూ.. 'మిషన్ బ్రెయిన్ అటాక్' ఏకైక జాతీయ ప్రచార కార్యక్రమమని చెప్పారు. ఐఎస్‌ఏ ప్రెసిడెంట్ ఎలక్ట్, ఐఎస్‌ఏ స్ట్రోక్ సమ్మర్ స్కూల్ 2024 కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ పి.విజయ మాట్లాడుతూ.. ఐఎస్‌ఏ మార్గదర్శకత్వంలో.. స్ట్రోక్ సమ్మర్ స్కూల్ పదో ఎడిషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. స్ట్రోక్ లేదా బ్రెయిన్ అటాక్ ప్రపంచవ్యాప్తంగా వైకల్యానికి ప్రధాన కారణమవుతోందని తెలిపారు. దీని బారిన పడిన వారికి దీర్ఘకాలిక రిహాబిలిటేషన్ కల్పించడమే ఐఎస్‌ఏ లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా 34 నగరాల నుంచి ఎంపికైన వంద మంది వైద్య విద్యార్థులు ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. ఆదివారం సైతం సదస్సు కొనసాగుతుందని నిర్వాహకులు వెల్లడించారు.

అడ్డువస్తున్నాడని అంతమొందించాడు

- బీటెక్ విద్యార్థి హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఏడుగురు నిందితులకు రిమాండ్



నిందితులను చూపిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి

పహాడీషరీఫ్: ప్రేమించిన యువతి వద్ద తన వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నాడన్న అనుమానంతో.. అన్నింటికీ అడ్డు తగులుతున్నాడన్న అక్కసుతో బీటెక్ విద్యార్థి ప్రశాంత్‌ను హత్య చేసినట్లు బాలాపూర్ పోలీసులు నిర్ధారించారు. ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న మొత్తం ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ టి.భూపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ఏరుపాలెం మండలం అయ్యవారి గూడెంకు చెందిన మొండ్రు శాంతయ్య, అనిత దంపతులు 20 ఏళ్ల క్రితం బాలాపూర్‌కు వలస వచ్చారు. వీరి కుమారుడు ప్రశాంత్ (21) ఎంవీఎస్‌ఆర్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బాలాపూర్ గ్రామానికి చెందిన పాలు విక్రయించే పోచబోయిన మాధవ్ యాదవ్ (24) ఇతనికి స్నేహం కుదిరింది. ప్రతి విషయాన్ని షేర్ చేసుకునే వీరి మధ్య తరచూ చిన్నచిన్న తగాదాలు జరుగుతుండేవి. ప్రశాంత్ ఎప్పటికప్పుడు అన్నీ మరిచిపోయినప్పటికీ మాధవ్ మాత్రం మనసులో ఉంచుకొనేవాడు. చివరికి తన స్నేహితులైన నాదర్‌గుల్‌కు చెందిన చింతల మహేశ్ యాదవ్ (25), రామోజు సుమంత్ చారి (21), బాలాపూర్‌కు చెందిన నల్లపూసల మహేశ్ (24), దొడ్డి హరీష్ (23), మాడపురం అఖిల్ కిరణ్ కుమార్ (20), నాదర్‌గుల్‌కు చెందిన కోహెడ యశ్వంత్(19)తో కలిసి మట్టుబెట్టాడు. నిందితులపై హత్య, ఆయుధ దుర్వినియోగం, ఎస్సీ,ఎస్టీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు.

నలుగురు తన వైపే చూడాలనే నైజంతో..

మాధవ్ యాదవ్ నలుగురిలో తనకంటూ ప్రత్యేకత ఉండాలని ఎప్పుడూ కొంతమందిని వెంటేసుకొని తిరుగుతుండేవాడు. ఈ క్రమంలో ఓ యువతితో ప్రేమాయణం కొనసాగిస్తున్నాడు. గంజాయి, సిగరెట్లు, మద్యం తాగుతాడని ప్రియురాలి ముందు ప్రశాంత్ తనను తక్కువగా చేశాడన్న అనుమానాన్ని మనసులో పెట్టుకున్నాడు. స్నేహితుడితో కలిసి మెలిసి ఉంటూనే అదును చూసి అంతమొందించాలనుకున్నాడు. స్థానికంగా ఫేమస్ కావాలని, అందుకు నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా ఎవరినైనా మర్డర్ చేస్తానంటూ తరచూ స్నేహితులతో చెప్పుకోవడం ప్రారంభించాడు. దీనికి తోడు ఇటీవల ఓ ఫ్లెక్సీ విషయంలోనూ ప్రశాంత్, మాధవ్ మధ్య గొడవ జరిగింది. తనకు అన్ని రకాలుగా అడ్డువస్తున్న ప్రశాంత్‌ను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ముందస్తు పథకంలో భాగంగా గంజాయి, మద్యం సేవించి ఈ నెల 22న సాయంత్రం గణేశ్ చౌక్ సమీపంలోని మండి హోటల్‌కు మాధవ్, మహేశ్, సుమంత్ వచ్చారు. పాన్ షాప్ వద్ద సిగరెట్ తాగుతూ పాత గొడవలను గుర్తు చేస్తూ ఒక్కసారిగా మాధవ్ తనతో తెచ్చుకున్న కత్తితో ప్రశాంత్ కడుపు, ఛాతి భాగాల్లో పొడిచాడు. మహేశ్, సుమంత్‌లు చేతులతో దాడి చేశారు. మిగిలినవారు సమీపంలో వారికి మద్దతుగా కాపుకాసారు. హత్య అనంతరం కుర్మల్‌గూడలో తలదాచుకున్న నిందితులను పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి కత్తి, రక్తపు దుస్తులు, ఆరు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

బోనాలు సంస్కృతికి ప్రతీక



కాటమయ్య ఆలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

- ఆలయాల అభివృద్ధికి కృషి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం కాటమయ్య బోనాల పండుగ సందర్భంగా ఆయన స్థానిక నాయకులతో కలిసి ఆలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యేను ఆలయ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, నాయకులు సత్యంయాదవ్, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కేశవులుగౌడ్, మహేందర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, శ్రీనుగౌడ్, శివగౌడ్, రమేశ్‌గౌడ్, గణేశ్‌గౌడ్, చిన్నాగౌడ్, కొండల్‌గౌడ్, శేఖర్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, వెంకటయ్యగౌడ్, ఎర్ర సత్యనారాయణగౌడ్, అంజయ్యగౌడ్, యాదయ్యగౌడ్, జగదీశ్, అశోక్, రాములు, చంద్రయ్యగౌడ్, భిక్షపతి, జహంగీర్‌అలీ, హీరాసింగ్, షాబుద్దీన్, తులసీరాం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు.. యువత చిత్తు

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న యువకులు

- మత్తులో గొడవలు, దాడులకు పాల్పడుతున్న వైనం
- అమ్డాపూర్‌లో వరుస ఘటనలు
- యువత దారి తప్పుతోందని పలువురి ఆందోళన

మొయినాబాద్: మద్యం మత్తులో యువత చిత్తవుతోంది. మద్యానికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవడమే కాకుండా ప్రమాదాలతో ఇతరుల ప్రాణాలమీదికి తెస్తున్నారు. మత్తులో మునిగిన కొంత మంది యువత అనవసర గొడవలు, దాడులకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఐదు రోజుల్లో మండల పరిధిలోని అమ్డాపూర్‌లో జరిగిన రెండు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మత్తులో యువత దారి తప్పుతుందనడానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

కాపుకాసి దాడికి పాల్పడిన అన్నదమ్ములు

మొయినాబాద్ మండలం అమ్డాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నారాయణ గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం నారాయణ బంధువుల వద్దకు వెళ్లడంతో కిరాణా షాపులో అతని కొడుకు యశ్వంత్ ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు వంశీధర్, శశిధర్ రాత్రి 9 గంటల సమయంలో కిరాణ షాపుకు వెళ్లి మద్యం కావాలని అడిగాడు. షాపులో లేదని యశ్వంత్ చెప్పడంతో అప్పటికే మద్యం సేవించి ఉన్న అన్నదమ్ములు బండ బూతులు తిట్టారు. యశ్వంత్ తన తండ్రికి ఫోన్ చేసి విషయం చెప్పడంతో అక్కడే ఉన్న అన్నదమ్ములు ఫోన్‌లో నారాయణను సైతం తిట్టారు. అంతటితో ఊరుకోని అన్నదమ్ములు ఈసీ వాగు బ్రిడ్జి వద్ద నారాయణకోసం కాపుకాశారు. రాత్రి 10 గంటల తరువాత నారాయణ, అతని భార్య కారులో వస్తుండగా బ్రిడ్జి వద్ద కారును అడ్డగించే ప్రయత్నం చేశారు. గమనించిన నారాయణ తప్పించుకుని ముందుకు వచ్చాడు. వెంటనే బైక్‌పై వెండించిన అన్నదమ్ములు రక్తమైసమ్మ ఆలయం ఎదుట స్పీడ్ బ్రేకర్ వద్ద కారు స్లో కాగానే బైకును అడ్డంగా పెట్టారు. నారాయణపై దాడి చేశారు. అతని భార్యపై సైతం చేయిచేసుకున్నారు. గమనించిన కొంత మంది యువకులు వచ్చి వారిని అడ్డుకున్నారు. ఆ రోజు నుంచి ఇద్దరు అన్నదమ్ములు పరారీలో ఉన్నారు. నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయంతో హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటి వరకు నిందితులను పట్టుకోలేదు.

గ్రామాల్లోనూ గంజాయి

అమ్డాపూర్‌లో జరిగిన వరస ఘటనలకు మత్తే కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపుల నిర్వహిస్తుండడంతో యువత మద్యానికి బానిసలవుతున్నారని వాపోతున్నారు. గంజాయికి సైతం అలవాటు పడి నిత్యం మత్తులో ఉంటున్నారని.. గ్రామాల్లో వీటిని కట్టడి చేయడానికి పోలీసులు చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలో జరిగిన రెండు ఘటనల్లోనూ యువకులు మద్యం మత్తులోనే ఉన్నారని.. వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



మద్యం మత్తులో కారు నడిపి..

అమ్డాపూర్ గ్రామానికి చెందిన యువకుడు శ్రీఖర్‌రెడ్డి మద్యం మత్తులో కారునడిపి బీభత్సం సృష్టించాడు. గురువారం రాత్రి అమ్డాపూర్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డికి చెందిన కారులో శ్రీఖర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి వెళ్తున్నారు. మద్యం మత్తులో ఉన్న శ్రీఖర్‌రెడ్డి కారు నడుపుతున్నాడు. హైస్కూల్ గేటు ఎదుట స్పీడ్ బ్రేకర్ వద్ద వేగంగా కారు నడిపి పక్కనే కిరాణాషాపు ముందు ఉన్న కూల్‌డ్రింక్స్ కేసులు, స్కూటీని ఢీకొట్టి, అదే వేగంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న రాంరెడ్డిని ఢీకొట్టారు. కారును ఆపకుండా వేగంగా పారిపోయారు. తీవ్ర గాయాలైన రాంరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును ఇప్పటి వరకు పరిశీలించలేదు.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో బెల్టుషాపులను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటాం. ఎవరైనా బెల్టు షాపు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. అమ్డాపూర్‌లో జరిగిన రెండు వేర్వేరు ఘటనలకు సంబంధించి బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పూర్తి విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా చూస్తాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

రేపే శ్రీకృష్ణ జయంత్యుత్సవం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 26న సాయంత్రం ఏడు గంటలకు సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో 65వ శ్రీకృష్ణ జయంత్యుత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్ యాదవ్ చెప్పారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లో ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఏటా నిర్వహించే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రముఖులంతా హాజరవుతారని చెప్పారు. గ్రేటర్ జిల్లాలకు చెందిన యాదవులంతా ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి అంజన్ యాదవ్, జంగిటి ప్రవీణ్ యాదవ్, ఎంబీ కృష్ణ యాదవ్, మొడికే శ్రీనివాసులు, కీర్తి సుధాకర్‌రావు యాదవ్, రాంప్రసాద్ యాదవ్, ఉడుత పరమేశ్వర్ యాదవ్, బొట్టు మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న యాదవ మహాసభ నాయకులు

బాధితులతో స్నేహంగా మెలగండి

- వైద్య సేవల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

కొత్తూరు: ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులతో వైద్యులు, సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని షాద్‌నగర్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం ఇన్ముల్‌నర్వ, తిమ్మాపూర్ గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాల్లోని వ్యాధి నిరోధక టీకా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది, రోగులకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రికి వచ్చే వారి ఇబ్బందులను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. స్థానికంగా వైద్యం అందుబాటులో లేని ఎడల ఎక్కడికి వెళ్లాలో సూచించాలని చెప్పారు. ఆశలు, ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జ్వర బాధితులను గుర్తించి వెంటనే వైద్య సేవలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సబ్‌సెంటర్లలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను సిబ్బంది ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్‌కుమార్, ఝాన్సీ, మానస, సిబ్బంది నాగేశ్, శ్రావన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపూర్ సబ్‌సెంటర్‌లో వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ విజయలక్ష్మి

అభివృద్ధికి రూ.176.46 కోట్లు

- నాలుగు నెలల్లో యూజీడీ, సీసీ రోడ్డు పనులు పూర్తి
- రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చెర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. శనివారం రాగన్నగూడలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మల్‌రెడ్డి రాంరెడ్డి, తెలంగాణ అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ అభివృద్ధికి టీయూఎఫ్‌ఐడీసీ, హెచ్‌ఎండీఏ, మున్సిపల్ సాధారణ నిధులతో కలిపి రూ.176.46కోట్ల నిధులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. మున్సిపల్ అభివృద్ధికి పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నాలుగు నెలల్లో అన్ని వార్డుల్లో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్లను వందశాతం పూర్తి చేస్తామన్నారు. రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని అటువంటి నిర్మాణాలను తొలగించాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గణేష్ నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత గౌడ్, కమిషనర్ అమరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో!

సమయ పాలన పాటించని ఉద్యోగులు, సిబ్బంది



ఉదయం 11 గంటలు దాటినా తెరుచుకోని ఎంఈఓ ఆఫీసు

చేవెళ్ల: ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది సమయ పాలన మర్చిపోయి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అడిగేవారు లేక ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళ్తారో..? తెలియని పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం 11: 30గంటలు దాటినా చేవెళ్లలోని ఎంఈఓ కార్యాలయం తెరుచుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. ఎంపీడీఓ కార్యాలయం వద్ద.. మూడు మండలాలకు చెందిన గెజిటెడ్ హెచ్‌ఎంల సమావేశం ఉండటంతో పలువురు ఉపాధ్యాయులు 11 గంటలకు ఎంఈఓ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికీ తాళం తీయకపోవడంతో ఎంపీడీఓ ఆఫీసు వద్దకు వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన విలేకరులు ఎంఈఓకు ఫోన్ చేయగా.. అటెండర్ లీవ్‌లో ఉన్నాడని, కంప్యూటర్ ఆపరేటర్ వచ్చి కార్యాలయం తెరుస్తాడని చెప్పారు. తాను కూడా సమావేశానికి హాజరయ్యేందుకు చేవెళ్లకే వస్తున్నానన్నారు. మధ్యాహ్నం 12 కావస్తుండగా తాపీగా వచ్చిన ఆపరేటర్ ఆఫీసును తెరిచాడు.

విద్యార్థిని అదృశ్యం



అక్షయ(ఫైల్)

మహేశ్వరం: బీ ఫార్మసీ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లి గ్రామానికి చెందిన నాయిని వెంకటేశ్ కుమార్తె అక్షయ (19) ఇబ్రహీంపట్నంలోని శ్రీ దత్తా కళాశాలలో బీ ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న యువతి ఐదు రోజులుగా ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 20న కుటుంబ సభ్యులు పనిమీద బయటికి వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా అక్షయ కనిపించలేదు. తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. అదే గ్రామానికి చెందిన తరుణ్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.